31వ వసంతంలోకి
చురకలు
కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్లా
గురువారం, జూలై 30, 2026
పేజీలు : 8

# నేడు, రేపు అతి భారీ వర్షాలు పడే అవకాశం

- అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్ నంబర్ 7989193131 కు సమాచారం అందించాలి
- జగిత్యాల కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 29 :** వాతావరణ శాఖ హెచ్చరికల మేరకు 2026 జూలై 29, 30 తేదీల్లో జిల్లాలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ బుధవారం తెలిపారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉందని, ప్రజలకు తక్షణ సహాయం అందించేందుకు కలెక్టరేట్‌లో 24 గంటల కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అత్యవసర అవసరాలు మినహా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లోతట్టు ప్రాంతాల ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే వాగులు, వంకలు, చెరువులు, నీటి ప్రవాహాలు అధికంగా ఉన్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా -మిగతా 2లో

### భారీ వర్షాల నేపథ్యంలో

# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- అధికారులు ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలి
- గోదావరి పరీవాహక మండలాల్లో ప్రత్యేక అప్రమత్తత అవసరం
- పునరావాస కేంద్రాలు అన్ని వసతులతో సిద్ధంగా ఉంచాలి
- ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు తక్షణ చర్యలు చేపట్టాలి
- జగిత్యాల కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 29:** జిల్లాలో భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ అధికారులను ఆదేశించారు. జగిత్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్ బుధవారం క్షేత్రస్థాయిలో పర్యటించి అధికారులకు పలు సూచనలు చేశారు. జగిత్యాల రూరల్ మండలం అనంతరం, గొల్లపేట లో, ధర్మపురి మండలం నేరెళ్ల, ఆక్సాయిపల్లి గ్రామాల పరిధిలో గల లో లెవల్ వంతెనల పై నుండి వరద నీరు ప్రవహిస్తున్నందున వరద పరిస్థితి ని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లా అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. వర్షాల కారణంగా ఎటువంటి సంఘటనలు, నష్టాలు, నీటి ముంపు, ప్రజల నుంచి ఫిర్యాదులు వచ్చినా వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను ఆలస్యం చేయకుండా జిల్లా కంట్రోల్ రూమ్ తో పాటు జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక ప్రాంత మండలాల అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, తరచూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ గోదావరి నీటిమట్టాన్ని నిరంతరం పరిశీలించాలని సూచించారు. ముంపునకు గురయ్యే అవకాశం ఉన్న గ్రామాలు, కాలనీలను ముందుగానే గుర్తించి, ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీల్లో ఏర్పడిన అడ్డంకులను వెంటనే తొలగించి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షిస్తూ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన సిబ్బంది, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు, తమ పరిధిలో ప్రత్యామ్నాయ పునరావాస కేంద్రాలను గుర్తించి, తాగునీరు, -మిగతా 2లో



### గ్రామాల అభివృద్ధిలో అధికారులు

# బాధ్యతతో పనిచేయాలి

**వెల్గటూర్ మండల సమీక్ష సమావేశంలో రాష్ట్ర మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్**

**చురకలు విలేఖరి, వెల్గటూర్, జూలై 29 :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వప్రధానలక్ష్యమని, అధికారులు గ్రామాల్లో సమస్యలను పరిష్క రించే దిశగా బాధ్యతాయుతంగా పనిచేయాలని రాష్ట్ర సాంఘీక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్‌కుమార్ ఆదేశించారు. బుధవారం నిర్వహించిన వెల్గటూర్ మండల అభివృద్ధి సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన తాగునీటి, పారిశుద్ధ్యం, రహదారులు, విద్య, వైద్యం, వ్యవసాయ, విద్యుత్తు, తదితర అభివృద్ధిపనులపై మం డల అధికారులు, సర్పంచులతో మంత్రి సమీక్షించారు. తాగునీటి సమస్యలు న్న గ్రామాల్లో ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేస్తుందని, వర్షాకా లంలో సీజనల్ వ్యాదులు సోకే ప్రమాదం ఉన్నందున ప్రాథమిక ఆరోగ్యకేంద్ర సిబ్బంది తగు చర్యలు చేపట్టాలని తెలి పారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని రైతులు వరిపంటల వైపు వెళ్ళవద్దని రాబోయే రోజుల్లో ఎల్ నినో ప్రభావంతో వర్షాలు పడకుంటే పంటలు నష్టపోయే పరిస్థితి -మిగతా 2లో

# భారీ వర్షాలపై జిల్లా పోలీసుల అప్రమత్తత

**వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎస్పీ, అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన**





**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 29:** జగిత్యాల జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ జిల్లా పోలీసు శాఖ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అధికారులు వరద ప్రభావిత ప్రాంతా లను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. అలాగే వాగులు, వంకలు, లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, నీరు నిలిచే ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి ఎస్పీ అశోక్ కుమార్ పోలీసు అధికారులు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. భారీ వర్షాల కారణంగా జిల్లాలో ఎక్కడైనా ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించి రాకపోకలను పునరుద్ధరించాలని, ప్రమా దకర ప్రాంతాల్లో తాత్కాలిక హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రజల ను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వరద నీరు ప్రవహిస్తున్న వాగులు, వంకలు, కల్వర్టులను ప్రజలు దాటకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. ఉరుములు, మెరుపుల సమయంలో గ్రామస్తులు అడవి ప్రాంతాలకు వెళ్లకుండా సామాజిక మాధ్యమాల ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలని, గోదావరి పరివాహక మండలాల్లో నదీ నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ పరిస్థితులను ఉన్నతాధికారులకు నివేదించాలని -మిగతా 2లో

# ఇది ప్రజాస్వామ్యంపై దాడి

- సమస్యల పరిష్కారం కోసం.. కలెక్టర్‌ను కలిసే హక్కు లేదా?
- పోలీసులు అడ్డుకోవడం ఏమిటి?
- ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి



**చురకలు ప్రతినిధి, హుజురాబాద్ జూలై 29 :** హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల హక్కుల కోసం, దళితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించడానికి వెళ్తే వందలాది మంది పోలీసులను మోహరించి అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి అని హుజూరాబాద్ ఎమ్మెల్యే శ్రీ పాడి కౌశిక్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. నియోజకవర్గంలోని దళితులకు నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసిన దళిత బంధు రెండో విడత నిధులను వెంటనే విడుదల చేయాలని, రైతుల సాగునీటి అవసరాల కోసం కన్నెపల్లి పంప్‌హౌస్‌ను వెంటనే ప్రారంభించి హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, మెదక్, వరంగల్, నల్గొండ జిల్లాల రైతులకు నీరు అందించాలని . నియోజకవర్గంలో పూర్తిగా దెబ్బతిన్న రహదారులను తక్షణమే పునర్నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లేందుకు వినతిపత్రం అందించడానికి వెళ్తే, ప్రభుత్వం భారీ ఎత్తున పోలీసులను మోహరించి అడ్డుకోవడం దురదృష్టకరమని అన్నారు. “దళితుల కోసం, రైతుల కోసం, ప్రజల కోసం కలెక్టర్‌ను కలవడానికి వెళ్తే ప్రభుత్వం కరీంనగర్ సీపీ ద్వారా పోలీసులను పెట్టి అడ్డుకుంటారా? ప్రజల తరపున ప్రశ్నించే ప్రజాప్రతినిధులకు ఇదేనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చే సమాధానం?” అని ఎమ్మెల్యే ప్రశ్నించారు. దళితులకు, రైతులకు జిల్లా కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకునే హక్కు లేదా? ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను ప్రభుత్వానికి వినిపించే -మిగతా 2లో

## ఘనంగా సినారే 99వ జయంతి వేడుకలు

**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 29 :** జ్ఞానపీఠ అవార్డు గ్రహీత, తెలంగాణ సాహితీ శిఖరం స్వర్గీయ సి. నారాయణ రెడ్డి 99 వ జయంతి సందర్భంగా కళాశ్రీ ఈశ్వరమ్మ సాహిత్య పీఠం జగిత్యాల అధినేత గుండేటి రాజు ఆధ్వర్యంలో బుధవారం సినారే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కళాశ్రీ అధినేత గుండేటి రాజు మాట్లాడుతూ సినారే సాహిత్యం అజరామరం అని ప్రపంచ సాహిత్య పుటల్లో చెరగని ముద్ర వేసుకున్నారని, ఆయన సాహిత్యం ముందు తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని, ఇప్పటికి సినారే గజల్స్ శ్రోతలను అలరిస్తున్నాయని పేర్కొన్నారు.కవులు సినారే పై కవితాగానం చేశారు.ఈ కార్యక్రమంలో ఉజగిరి జమున,కవయిత్రులు అయిత అనిత,మద్దెల సరోజన,లక్కరాజు శ్రీలక్ష్మి,ముల్కస్థం లావణ్య,కటుకం కవిత,మాడిశెట్టి శ్రీనివాస్,ఓదెల గంగాధర్,డా.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

## మాజీ ఉపాధ్యాయునికి సన్మానం



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 29 :** కమాన్ పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ శ్రీ సాయిబాబా ఆలయంలో మాజీ ఉపాధ్యాయుని బుధవారం ఘనంగా సన్మానించారు. గురుపౌర్ణమిను పురస్కరించుకొని కమాన్ పూర్ గ్రామపంచాయతీ పరిధిలోని కిష్టం పల్లి చెందిన కె గోపాల కిషన్ ను శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఓదెలు గౌడ్, వెంకట్ రెడ్డి, వంగ రవి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## పులుల సంరక్షణపై విద్యార్థులకు అవగాహన



**చురకలు ప్రతినిధి,నిర్మల్, జూలై, 29 :** ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా సారంగాపూర్ మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జామ్‌లో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగిని భాను హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పులుల ప్రాముఖ్యత, పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో వాటి కీలక పాత్ర, జీవవైవిధ్య పరిరక్షణలో పులుల అవసరాన్ని వివరించారు. అనంతరం ప్రపంచ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలను అందజేసి అభినందించారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణారావు, కరిపే రవళి సర్పంచ్, జామ్, నజీర్ ఖాన్ ఉప అటవీ క్షేత్ర అధికారి, సారంగాపూర్, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, అటవీ శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని పులుల సంరక్షణ, అటవీ పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ పట్ల తమ బాధ్యతను గుర్తిస్తూ ప్రకృతిని కాపాడేందుకు కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు.

## గురు పౌర్ణమి మహాగాయత్రి యజ్ఞం




**చురకలు విలేకరి, జగిత్యాల, జూలై 29 :** ఆషాఢ మాస గురు పౌర్ణమి సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని గాయత్రి జ్ఞాన మందిరంలో శ్రీ విశ్వ గాయత్రి పరివార్ జగిత్యాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం గాయత్రీ యజ్ఞం మృత్యుంజయ హోమం వైభవంగా నిర్వహించారు. కొమరవెల్లి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో గురజీ లు కాసం అశోక్, కనపర్తి నాగభూషణం హోమం నిర్వహించగా యజ్ఞ కర్తలుగా ఇల్లందుల పురుషోత్తం , దుర్శెట్టి కిరణ్ కుమార్ , హోమం చేయగా కార్యకర్తలు కనికరం లచ్చన్న, లక్ష్మీపురం శంకర్, అశోక్ గుప్తా , నాగభూషణం , పోచ మల్ల సంపత్, మందులోజు భాస్కర్, కొమరవెల్లి లక్ష్మి, పొట్ల బత్తిని శంకర్ దంపతులు బొందుకూరి శ్రీనివాస్ పాల్గొన్నారు. భక్తులు , మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. గాయత్రి గురువులకు గురుపూజ సన్మాన కార్యక్రమం చేశారు.

# భారీ వర్షాలపై జిల్లా పోలీసుల అప్రమత్తత

**మొదటి పేజీ తరువాయి....** ఆదేశించారు. వర్షాల సమయంలో చేపల వేట, ఈత, వరద నీటిలోకి వెళ్లడం వంటి ప్రమాదకర చర్యలకు దూరంగా ఉండేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని, గతంలో వరదలతో ప్రభావితమైన ప్రాంతాలపై ప్రత్యేక నిఘా కొనసాగించాలని సూచించారు. ప్రతి పోలీసు వాహనంలో తాళ్లు, లైఫ్ జాకెట్లు, లైఫ్ బోయ్‌లు లేదా టైర్ ట్యూబులు వంటి అత్యవసర రక్షణ సామగ్రిని అందుబాటులో ఉంచాలని, విధుల్లో ఉన్న ప్రతి పోలీసు సిబ్బంది తప్పనిసరిగా రెయిన్‌కోట్లు వెంట తీసుకెళ్లాలని ఆదేశించారు.విద్యుత్ తీగలు తెగిపోవడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం వంటి ఘటనలు గుర్తించిన వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి తక్షణ చర్యలు తీసుకునేలా సమన్వయం చేయాలని సూచించారు. మూసుకుపోయిన డ్రైనేజీలను రెవెన్యూ శాఖతో సమన్వయం చేసుకొని జేసీబీల సహాయంతో వెంటనే శుభ్రం చేయించి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భారీ వర్షాల సమయంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప బయటకు రావద్దని, వాగులు, వంకలు, వరద నీటిని దాటే ప్రయత్నం చేయవద్దని, పిల్లలను నీటి ప్రవాహాల వద్దకు వెళ్లనీయవద్దని కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి తలెత్తిన వెంటనే స్థానిక పోలీసులకు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు.

### గ్రామాల అభివృద్ధిలో అధికారులు
# బాధ్యతతో పనిచేయాలి

**మొదటి పేజీ తరువాయి....** ఉందని ఆరు తడి పంటలుమాత్రమే వేసుకుం టే మం చిదని మంత్రి రైతులకు సూచించారు. సమస్యలపరిష్కారంలో అధికారులు నిర్ల క్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, అభివృద్ధి పనుల్లో పారదర్శ కత పాటించాలని కోరారు. అనంతరం ఎస్ఐఆర్ ప్రక్రియను వందశాతం పూర్తి చేసిన బిఎల్ఓలను మంత్రి సన్మానించారు.మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో ఎంపీడీఓ వెంకటప్రసాద్, తహశీల్దార్ శేఖర్, మండల స్థాయి అధికారులు, గ్రామసర్పంచులు, అధికారులు, ప్రజాప్రతి నిధులు పాల్గొన్నారు.

# ఇది ప్రజాస్వామ్యంపై దాడి

**మొదటి పేజీ తరువాయి....** హక్కును కూడా హరించే ప్రయత్నం ఎందుకు చేస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ రాజకీయ ఒత్తిళ్లకు లోనుకాకుండా శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణపై దృష్టి సారించాలని సూచించారు. దొంగతనాలు, నేరాల నియంత్రణపై మరింత శ్రద్ధ చూపాలని, ప్రజా సమస్యలపై పోరాడుతున్న వారిని అడ్డుకోవడం పోలీసుల బాధ్యత కాదని అన్నారు. ప్రజల హక్కుల కోసం తమ పోరాటం నిరంతరం కొనసాగుతుందని ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి స్పష్టం చేశారు.

# నేడు, రేపు అతి భారీ వర్షాలు

మొదటి పేజీ తరువాయి....
అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు, ఇబ్బందులు ఎదురైనా వెంటనే 7989193131 నంబర్‌కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ కోరారు. అందిన ప్రతి ఫిర్యాదుపై సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపడతారని తెలిపారు. ప్రజలు అధికార యంత్రాంగం సూచనలను పాటిస్తూ, వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి తమ ప్రాణ, ఆస్తులను కాపాడుకునేందుకు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

### భారీ వర్షాల నేపథ్యంలో
# అధికారులు అప్రమత్తంగా ఉండాలి

మొదటి పేజీ తరువాయి...
విద్యుత్, పారిశుద్ధం, ఆహారం తదితర మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు జిల్లా యంత్రాంగంతో నిరంతరం సమన్వయం కొనసాగిస్తూ, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే అత్యంత ప్రాధాన్యతగా భావించి వేగవంతంగా, సమర్థవంతంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో జగిత్యాల. ఆర్డీవో మధుసూదన్ జగిత్యాల రూరల్ తహసీల్దార్ షాదాబ్ హాకీం, ధర్మపురి తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ నేతలది దౌర్భాగ్యం

**-నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి పంపింగ్ తమ వల్లేనని చెప్పుకోవడం విడ్డూరం**
**-రైతుల ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం..**
**-అందులో భాగంగానే నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌ల నుంచి నీటి విడుదల**
**-కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**



**కరీంనగర్, జూలై 29:** కాంగ్రెస్ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌లను ప్రారంభించి రైతుల కోసం నీటిని ఎత్తిపోస్తుంటే అది తమ వల్లేనని చెప్పుకోవడం బీఆర్ఎస్ నేతల దౌర్భాగ్యానికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు విమర్శించారు.బుధవారం మీడియాతో ఆయన మాట్లాడుతూ, రైతుల ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అందులో భాగంగానే నంది-మేడారం, గాయత్రి పంప్‌హౌస్‌లలోని బాహుబలి మోటార్లను ప్రారంభించి 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నామని తెలిపారు. రైతుల పంటలు ఎండిపోకుండా, సాగునీటి అవసరాలు తీరేలా ప్రభుత్వం బాధ్యతాయుతంగా చర్యలు చేపడుతుంటే, దానిని తమ పోరాట ఫలితమని బీఆర్ఎస్ ప్రచారం చేయడం రాజకీయ అవకాశవాదానికి పరాకాష్ట అన్నారు.పదేళ్లపాటు అధికారంలో ఉన్న సమయంలో ప్రచారానికే పరిమితమైన బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల కోసం తీసుకుంటున్న ప్రతి నిర్ణయానికీ క్రెడిట్ తీసుకోవాలని ప్రయత్నించడం హాస్యాస్పదమన్నారు. సోషల్ మీడియా వేదికగా అసత్య ప్రచారాలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రజలు వాస్తవాలను గుర్తించే స్థితిలో ఉన్నారని చెప్పారు.రైతులకు అవసరమైన సమయంలో సాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తోందన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమైతే, ప్రతి అంశాన్ని రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడం బీఆర్ఎస్ నైజంగా మారిందన్నారు.ప్రజల మెప్పు కోసం ఎన్ని విన్యాసాలు చేసినా, ఎన్ని దుష్ప్రచారాలు చేసినా బీఆర్ఎస్‌ను మళ్లీ నమ్మే పరిస్థితిలో తెలంగాణ ప్రజలు లేరని, రైతుల సంక్షేమం, సాగునీటి నిర్వహణ, వ్యవసాయాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన అజెండా అని వెలిచాల రాజేందర్‌రావు పేర్కొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

**-జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 29 :** విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని బాల సదన్, శ్రీ వాల్మీకి ఆవాసం సేవ భారతిలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. రాజ గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలోని తరగతి గదులు, వంటశాలను పరిశీలించి విద్యార్థులకు అందుతున్న భోజనం పరిశుభ్రత, వంటశాల నిర్వహణ, ఆరోగ్యం తదితర అంశాలను పరిశీలించారు. అవాసాల ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.అనంతరం అవాసాల్లో విద్యా బోధన, విద్యార్థుల హాజరు, మౌలిక సదుపాయాలు,పాఠశాల నిర్వహణ, భోజనం అమలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సురక్షితమైన,పరిశుభ్రమైన విద్యా వాతావరణాన్ని కల్పించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు.ఈ కార్యక్రమంలో డి.డబ్ల్యూ.వో భాస్కర్, ఉపాధ్యాయులు,రెడ్ క్రాస్ సభ్యులు సిరిసిల్ల శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

## పదోన్నతి పొందిన ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఎస్పీ శుభాకాంక్షలు



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 29 :** జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించి ఎస్ఐగా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, వెంకటేశ్వర్లుకు ఎస్ఐ హోదాకు సంబంధించిన స్టార్ చిహ్నాన్ని అలంకరించి పదోన్నతి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పదోన్నతి అనేది కేవలం హోదా పెరగడం మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా మరింత పెరుగుతాయన్నారు. పెరిగిన బాధ్యతలను క్రమశిక్షణ,నిజాయితీ, అంకితభావంతో నిర్వహిస్తూ ప్రజల్లో పోలీసు శాఖపై విశ్వాసం, గౌరవం మరింత పెరిగేలా విధులు నిర్వర్తించాలని సూచించారు.

## గుర్రపుటెక్కపై బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తుల విజ్ఞప్తి



చురకలు ప్రతినిధి కోరుట్ల,జూలై 29 : కోరుట్ల మండలంలోని కల్లూరు గ్రామంలో ఉన్న గుర్రపుటెక్క వద్ద వర్షాకాలంలో వరద నీరు చేరడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని మాజీ సర్పంచ్, తెలంగాణ ఎంఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనతడుపుల అంజయ్య తెలిపారు.పక్కనే ఉన్న సర్పరాజుపూర్ గ్రామ రైతుల్లో సుమారు 90 శాతం మందికి వ్యవసాయ భూములు కల్లూరు గ్రామ పరిధిలోనే ఉండటంతో వ్యవసాయ పనుల కోసం రాకపోకలు సాగించడం చాలా కష్టంగా మారుతోందని ఆయన పేర్కొన్నారు. రాయికల్ మండలంలోని పలు గ్రామాల ప్రజలు, కల్లూరు మోడల్ స్కూల్‌కు వచ్చే పైడిమడుగు, జోగన్‌పల్లి తదితర గ్రామాల విద్యార్థులు కూడా ఇదే మార్గాన్ని ఉపయోగిస్తున్నారని చెప్పారు.ఈ నేపథ్యంలో గుర్రపుటెక్క వద్ద శాశ్వత బ్రిడ్జిని నిర్మించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ప్రస్తుతం అక్కడ రక్షణ గోడలు (సైడ్ వాల్స్) లేకపోవడంతో రాత్రి వేళల్లో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.అందువల్ల సంబంధిత అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి, బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన అంచనాలు (ఎస్టిమేట్) సిద్ధం చేసి సంబంధిత మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపించాలని గ్రామస్తులతో కలిసి మాజీ సర్పంచ్ మనతడుపుల అంజయ్య విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-ఇబ్రహింపట్నం ఎస్ ఐ నవిన్ కుమార్**




**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (29) :** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇబ్రహింపట్నం ఎస్ ఐ నవిన్ కుమార్ బుధవారం అన్నారు.గోదుర్, తిమ్మపూర్, తిమ్మపూర్ తండ, ఫకిర్ కోండాపూర్, యామపూర్, వేములకుర్తి, బర్దిపూర్, ములరాంపూర్,ఎర్దండి,కోమటికోండాపూర్ , వర్షకోండ, డబ్బ, అమ్మకపెట్, ఎర్రాపూర్, ఇబ్రహింపట్నం,కేశాపూర్, కోజన్ కోత్తుర్ గ్రామల ప్రజలకు విజ్ఞప్తి చేశారు.జగిత్యాల జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు.వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం మరో నాలుగు రోజుల పాటు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.ముఖ్యంగా వాగులు, వంకలు, కల్వర్టులు, చెరువులు, నదుల వద్దకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100,112 లకు సమాచారం అందించి పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఎస్ ఐ కోరారు.

**పోలీసుశాఖ వారి సూచనలు....**

ఉధృతంగా ప్రవహిస్తున్న నీటిలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ దిగవద్దు, చేపల వేట కోసం చెరువులు, వాగులు, నదుల వద్దకు వెళ్లవద్దు, నీటితో మునిగిన కల్వర్టులు,వంతెనలు,వాగులను దాటే ప్రయత్నం చేయవద్దు,పశువులను మేతకు తీసుకెళ్లే వారు ప్రత్యేక జాగ్రత్తలు పాటించాలి.విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలను ముట్టుకోవద్దు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు విద్యుత్ తీగలు,నీటి ప్రవాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలి. శిథిలావస్థలో ఉన్న లేదా కూలిపోయే ప్రమాదం ఉన్న ఇళ్లలో నివసించవద్దు. అత్యవసరం కాని దూర ప్రయాణాలను వాయిదా వేసుకోవడం మంచిది.మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దు. వాహనాల్లో అనుమతించిన పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లవద్దు. సెల్ఫీలు,రీల్స్ కోసం వాగులు, చెరువులు, జలపాతాలు లేదా వరద నీటి ప్రాంతాలకు వెళ్లి ప్రాణాలను ప్రమాదంలో పెట్టుకోవద్దు. వర్షాలు కురిసే సమయం లో బయట తిరగడం మానుకోవాలి.

# చేతి వృత్తులు హస్తకళలు పరిరక్షించాలి

**-కేంద్ర ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి**

**-ఇబ్రహింపట్నం మండల కేంద్రంలో శిక్షణలో**

**-వరంగల్ హ్యాండి క్రాఫ్స్ ప్రమోషన్ అధికారి ప్రవిణ్ కుమార్**



**చురకలు విలేకరి ఇబ్రహింపట్నం జులై (29) :** దేశ సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకలైన చేతి వృత్తులు, హస్తకళలను పరిరక్షించడంతో పాటు కళాకారుల ఆర్థికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ, ప్రోత్సాహక కార్యక్రమాలను అమలు చేస్తోందని వరంగల్ మినిస్ట్రీ ఆఫ్ హ్యాండీక్రాఫ్ట్స్ అండ్ టెక్స్‌టైల్స్ హ్యాండీక్రాఫ్ట్స్ ప్రమోషన్ అధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. బుధవారం జగిత్యాల జిల్లా ఇబ్రహింపట్నం మండల కేంద్రంలోని శాలివాహన సంఘ భవనంలో నిర్వహించిన శిక్షణ, అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సంప్రదాయ వృత్తులు కాలానుగుణంగా అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నాయని, అయినప్పటికీ కళాకారులు తమ నైపుణ్యాన్ని కాపాడుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. చేతి వృత్తులు కేవలం ఉపాధికి మాత్రమే కాకుండా భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబంగా నిలుస్తాయని పేర్కొన్నారు. యువత కూడా హస్తకళల పట్ల ఆసక్తి పెంపొందించుకుని ఆధునిక మార్కెట్ అవసరాలకు అనుగుణంగా కొత్త ఉత్పత్తులను రూపొందించాలన్నారు .కేంద్ర ప్రభుత్వం కళాకారుల కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు,ఆర్థిక సహాయ కార్యక్రమాలు, శిక్షణ అవకాశాలు, మార్కెటింగ్ సౌకర్యాలు, ప్రదర్శనలు, రుణ సదుపాయాలు తదితర అంశాలపై ఆయన సవివరంగా వివరించారు. హస్తకళాకారులు తమ ఉత్పత్తులకు విస్తృత మార్కెట్‌ను కల్పించుకోవడానికి ప్రభుత్వ శాఖలు అందిస్తున్న అవకాశాలనువినియోగించుకోవాలన్నారు . ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన, సామాజిక భద్రతా పథకాలు, ప్రమాద బీమా పథకాలు, పొదుపు విధానాలు, కుటుంబ భద్రతకు సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కల్పించారు. కళాకారులు తమ కుటుంబాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని బీమా పథకాలలో తప్పనిసరిగా చేరాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో హస్తకళల ఉత్పత్తుల నాణ్యత పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, మార్కెటింగ్ పద్ధతులు,ఆన్‌లైన్ విక్రయాల అవకాశాలు, స్వయం ఉపాధి విస్తరణ వంటి అంశాలపై కూడా చర్చించారు. పాల్గొన్న కళాకారులు తమ సందేహాలను అధికారులను అడిగి నివృత్తి చేసుకున్నారు.30 మంది సిద్ధం అయితే శిక్షణ సైతం ఇచ్చి బ్యాంకు ద్వారా రుణాలు ఇప్పించి వారి అభివృద్ధి కీ సహకారం అందచేస్తామన్నారు. ఈకార్యక్రమంలోశాలివాహన సంఘ జిల్లా ఉపాధ్యక్షుడు రాధరపు దేవదాస్, జిల్లా సలహదారు నాంపల్లి రమేష్, మండల అధ్యక్షుడు వెలిశాల శేఖర్, ప్రదానకార్యదర్శి మారుపాక రమేష్, తుక్కన్న,రాజరెడ్డి,నడ్పి నర్సయ్య అయాగ్రామల శాలివాహనులు తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-టీఆర్ఎస్ నాయకులు అజార్**



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై,29 :** కోరుట్ల మండలం, పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో రానున్న రెండు నుంచి మూడు రోజుల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ అంచనాలు సూచిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీఆర్ఎస్ నాయకులు అజార్ విజ్ఞప్తి చేశారు.అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని, ప్రయాణాల సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రైతులు వ్యవసాయ పనుల కోసం పొలాలకు వెళ్లేటప్పుడు బోర్‌వెల్ మోటార్లను ఆన్ చేసే సమయంలో విద్యుత్ షాక్‌కు గురయ్యే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.భారీ వర్షాల కారణంగా రహదారులపై కాల్వలు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున వాహనదారులు ప్రవాహం తగ్గిన తర్వాతే ముందుకు వెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రోడ్లపై ఏర్పడిన గుంతల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని, ప్రమాదాల వల్ల తీవ్ర గాయాలు, ఎముకలు విరిగే ప్రమాదం ఉందన్నారు.

వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఇంటి చెత్తను రోడ్లపై వేయకుండా మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికే అందించాలని కోరారు. లేకపోతే దోమలు పెరిగి డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు.శుభ్రమైన వాతావరణంలో వండిన వేడి ఆహారాన్నే తీసుకోవాలని, బయట జంక్ ఫుడ్, బేకరీ పదార్థాలు, రోడ్డు పక్కన విక్రయించే ఆహారాన్ని వీలైనంత వరకు నివారించాలని సూచించారు. అదేవిధంగా చిన్నపిల్లలను చెరువులు, కాలువలు, నదులు వంటి నీటి ప్రవాహం ఉన్న ప్రాంతాలకు వెళ్లనివ్వవద్దని ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని టీఆర్ఎస్ నాయకులు అజార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఎస్ఐగా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లును అభినందించిన ఎమ్మెల్యే



**చురకలు ప్రతినిధి, జగిత్యాల,జూలై 29 :** జగిత్యాల టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహించిన వెంకటేశ్వర్లు ఎస్ఐగా పదోన్నతి పొందారు. పదోన్నతి అనంతరం ఆయన బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఎస్ఐగా పదోన్నతి పొందిన వెంకటేశ్వర్లుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాసేవలో మరింత బాధ్యతతో విధులు నిర్వర్తించాలని సూచించారు.

## దంచికొడుతున్న వానలు

**-మోడల్ స్కూల్ విద్యార్థుల అవస్థలు**



**చురకలు విలేకరి, మల్లాపూర్, జూలై 29 :** మంగళవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి చెరువులు,కుంటలు పొంగిపొర్లు తున్నాయి.ఎల్ ని నో ప్రభావంతో వర్షాలు సంవృద్ధిగా కురిసే అవకాశం లేదని అధికారులు చెబుతుండగా అకస్మాత్తుగా మంగళవారం అర్ధరాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురియడంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.కానీ మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్ పాఠశాలలోని విద్యార్థుల అవస్థలు మాత్రం మారడం లేదు. రోడ్డు సరిగా లేదని గతేడాది జిల్లా ఉన్నతాధికారులకు విన్నవించినా స్పందించడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ యాడాదైనా మోడల్ స్కూల్ రహదారి పరిస్థితి మారుతుందా అధికారులు దృష్టి సారిస్తారా లేదో ఏ దేవుడికే తెలుసంటూ విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటు న్నారు.కాగా వాతావరణ శాఖ, జిల్లా అధికారులు సూచనల మేరకు రెవెన్యూ అధికారులు లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను అప్రమత్తం చేసినట్లు ప్రత్యాత్నాయ ఏర్పాట్లకు సిద్దం చేసినట్లు రెవెన్యూ, పోలీసు అధికారులు చెబుతున్నారు.

## సాయిబాబా ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



**చురకలు విలేకరి, రాయికల్, జూలై 29 :** గురు పౌర్ణమి సందర్భంగా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలోని సాయిబాబా ఆలయాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా సాయిబాబాని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఎమ్మెల్యేకు ఆశీర్వచనం అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గురు పౌర్ణమి భారతీయ సంస్కృతిలో గురువుల గొప్పతనాన్ని స్మరించుకునే పవిత్రమైన పర్వదినమని అన్నారు. సాయిబాబా ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ హిమవంత రావు,ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, సర్పంచ్ నీరటీ శ్రీనివాస్,పాక్స్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ సామల్ల లావణ్య వేణు,నాయకులు కోల శ్రీనివాస్,మరిపెల్లి శ్రీనివాస్,బెజ్జంకి మోహన్,మరి పెల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-మీ ప్రాణ భద్రతే ప్రాధాన్యం.... చిన్న నిర్లక్ష్యం... పెద్ద ప్రమాదం**

**-విద్యుత్ భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి**

**-జగిత్యాల విద్యుత్ శాఖ సూపరిండెంట్ ఇంజనీర్ సుదర్శనం**




**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 29 :** వర్షాకాలంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశం ఎక్కువగా ఉంటుందని జగిత్యాల సర్కిల్ సూపరిండెంట్ ఇంజనీర్ బి. సుదర్శనం తెలిపారు. విద్యుత్ మన జీవితానికి వెలుగు నిచ్చే అమూల్యమైన శక్తి అయినప్పటికీ,చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారి తీస్తుందని హెచ్చరించారు.గృహ విని యోగదారులు,రైతులు,పశువులకా పలాదారులు, విద్యార్థులు, ప్రజలందరూ ఈ క్రింది విద్యుత్ భద్రతా సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు.

**వర్షాకాలంలో పాటించాల్సిన ముఖ్యమైన జాగ్రత్తలు...**

వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు, స్టే వైర్లు, సపోర్ట్ వైర్లు, ట్రాన్స్ఫార్మర్లు, విద్యుత్ పరికరాలు లేదా తడి గోడలకు ఆను కుని ఉన్న విద్యుత్ ఉపకరణాలను తాకవద్దన్నారు.తెగిపోయిన, వేలాడు తున్న లేదా తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లవద్దు, తాకవద్దన్నారు. ఉరుములు, మెరుపులు సంభవిస్తున్న సమయంలో చెట్ల క్రింద నిలబడకండి. బహిరంగ ప్రదేశాల్లో అవసరం లేకుండా సంచరించవద్దన్నారు. తడి చేతులతో స్విచ్చు, ప్లగ్గు, మీటర్ బోర్డులు,మోటార్లు,గీజర్లు, కూలర్లు, వాటర్ హీటర్లు లేదా ఇతర విద్యుత్ పరికరాలను తాకరాదన్నారు. సెల్ఫోన్ ఛార్జింగ్లో ఉండగా ఫోన్లో మాట్లాడవద్దని, ముందుగా ఛార్జర్ను తొలగించిన తర్వాత మాత్రమే వినియోగించాలని, ఇంటి వైరింగ్కు తప్పనిసరిగా నాణ్యమైన ఎర్తింగ్ చేయించాలని,ఐఎస్ఐ నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యుత్ పరికరాలు ,ప్లగ్గులు, వైర్లు, ఛార్జర్లు మాత్రమే ఉపయోగించాలన్నారు. పాడైన, అతుకు లు (జాయింట్లు) ఉన్న, ఇన్సులేషన్ దెబ్బతిన్న వైర్లు వెంటనే మార్చించాలని, ఇంటి విద్యుత్ మరమ్మతులు స్వయంగా చేయకుండా అర్హత కలిగిన ఎలక్ట్రీషియ న్తో మాత్రమే చేయించాలన్నారు. బట్టలు ఆరబెట్టేటప్పుడు ఇనుప దండెలకు బదులుగా ప్లాస్టిక్ దండెలు ఉపయోగి ంచాలని, విద్యుత్ సర్వీస్ వైర్లు, మీటర్ బోర్డులు లేదా విద్యుత్ లైన్ల సమీపంలో తడి బట్టలు ఆరబెట్టవద్దన్నారు. ఇంటి ముందు ఏర్పాటు చేసే రేకులు, ఇనుప నిర్మాణాలు విద్యుత్ వైర్లను తాకకుండా తగిన దూరంలో ఉండేలా చూసుకోవా లన్నారు. రైతుల పంట ఎంత విలువైనదో, మీ ప్రాణం అంతకంటే విలువైందని, వ్యవసాయ మోటార్లు ఆన్ చేసే ముందు స్టార్టర్, వైర్లు, స్విచ్చు సురక్షితంగా ఉన్నాయో లేదో పరిశీలిం చాలన్నారు. మోటార్లు, స్టార్టర్లు, ఏఐ పైపులు, ఫుట్ వాల్వులు, పంపు సెట్లకు తప్పనిసరిగా సరైన ఎర్తింగ్ చేయించాల న్నారు. అతుకులు లేని నాణ్యమైన సర్వీస్ వైర్లు మాత్రమే ఉపయోగిం చాలన్నారు. విద్యుత్ మోటార్లు, పైపులు, ఫుట్ వాల్వులు లేదా తడి పరిస్థితుల్లో ఉన్న పరికరాలను నేరుగా తాకవద్దన్నారు. ట్రాన్స్ఫార్మర్ల వద్ద సొంతంగా ఫ్యూజులు మార్చడం, ఏబీ స్విచ్చు ఆపరేట్ చేయడం, కాలిన తీగలు సరిచే యడం వంటి పనులు చేయరాదన్నారు. మోటార్ల మరమ్మతులు అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్తో మాత్రమే చేయించాలన్నారు. విద్యుత్ లైన్ల క్రింద ఇనుప పైపులు,స్ప్రింక్లర్ పైపులు ఎత్తేటప్పుడు అత్యంత జాగ్రత్త పాటించాలని,ట్రాక్టర్లు, హార్వెస్టర్లు నడిపేటప్పుడు విద్యుత్ లైన్లకు తగలకుండా చూసుకోవాలన్నారు. వ్యవసాయ భూములకు ఎట్టి పరిస్థితు ల్లోనూ ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయవద్దని, ఇది చట్టవిరుద్ధమే కాక ప్రాణాంతకం కూడా, చేపల వేట లేదా వన్యప్రాణులను వేటాడేందుకు విద్యుత్ ప్రవాహాన్ని ఉపయోగించడం తీవ్రమైన నేరమన్నారు. ప్రతి వినియోగదారు విద్యుత్ భద్రతా ప్రమాణాలను పాటించడం ద్వారా ప్రమాదాలను పూర్తిగా నివారించవచ్చని, విద్యుత్ తో అప్రమత్తంగా ఉండాలని, సురక్షితంగా జీవించండి... సురక్షితంగా వ్యవసాయం చేయాలని సూచించారు. మీ ప్రాణ భద్రత– మా బాధ్యత... మీ సహకారం అత్యవసరమని, ఏదైనా విద్యుత్ ప్రమాదం లేదా లోపం గమనించిన వెంటనే టిజిఎన్పిడిసిఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

# జిల్లాలో జోరు వానలు..



**-లోతట్టు ప్రాంతాలు జలమయం**

**-నీటమునిగిన లోలెవల్ బ్రిడ్జిలు... రాకపోకలు అంతరాయం**

**-భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న అధికార యంత్రాంగం**

**-లోలెవల్ బ్రిడ్జిలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 29 :** జగిత్యాల జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని అన్ని మండలాల్లో మంగళవారం అర్ధరాత్రి నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. జగిత్యాల జిల్లాలోని పలు లోలెవల్ వంతెనలు నీటమునిగి రాకపోకలకు అంతరాయం కలిగింది. జగిత్యాల జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ రోడ్డులో వరద నీరు రోడ్డుపై భారీగా ప్రవహించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. జగిత్యాల పట్టణంలోని వెంకటాద్రినగర్ – గోవిందుపల్లె బ్రిడ్జిగా భారీగా వరదనీరు ప్రవహించడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. మున్సిపల్ అధికారులు జెసిబి సహాయంతో ప్రజలను బ్రిడ్జిని దాటించారు. జగిత్యాల జిల్లాలోని రాయికల్ మండలంలోని అల్లీపూర్ గ్రామంలో 69 మి.మీ, రాయికల్ పట్టణంలో 60.3 మిమీ, మల్యాలలో 58.3 మిమీ, సారంగాపూర్లో 57.8 మిమీ, జగిత్యాల జిల్లా కేంద్రంలో 52.5 మిమీ, పోలాస గ్రామంలో 52.3 మిమీ, ఎండపల్లిలో 49.8 మిమీ, వెల్గటూర్, బుగ్గారం, పెగడపల్లిలో 49 మిమీ, మల్లాపూర్ లో 48 మిమీ, గొల్లపల్లిలో 38.6 మిమీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. కాగా జగిత్యాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేసింది. అత్యసర పరిస్థితుల్లో సహాయక



చర్యల నిమిత్తం కలెక్టరేట్లో ఏర్పాటు చేసి హెల్ప్ డెస్క్ 7989193131 నంబర్ను సంప్రదించాలని అధికారులు కోరారు.



# వర్షాకాలంలో విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

**-టీజీఎన్‌పీడీసీఎల్ రాజన్న సిరిసిల్ల జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్**



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట జూలై 29 :** వర్షాకాలంలో ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులు, భారీ వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని టీజీఎన్‌పీడీసీఎల్ రాజన్న సిరిసిల్ల జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్ తెలిపారు. చిన్నపాటి నిర్లక్ష్యం కూడా ప్రాణాంతక ప్రమాదాలకు దారితీయవచ్చని హెచ్చరిస్తూ, ప్రజలు విద్యుత్ భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి చేశారు.గృహ వినియోగదారులు, రైతులు, పశువుల కాపరులు, విద్యార్థులు సహా ప్రతి ఒక్కరూ విద్యుత్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. వర్షం కురుస్తున్న సమయంలో తడిసిన విద్యుత్ స్తంభాలు,స్టే వైర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, తడి గోడలకు ఆనుకుని ఉన్న విద్యుత్ పరికరాలను తాకరాదన్నారు.తెగిపోయిన లేదా వేలాడుతున్న విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లకూడదని స్పష్టం చేశారు.తడి చేతులతో స్విచ్‌లు, ప్లగ్‌లు,మీటర్ బోర్డులు,మోటార్లు, గీజర్లు,కూలర్లు వంటి విద్యుత్ పరికరాలను తాకరాదని, సెల్‌ఫోన్ ఛార్జింగ్‌లో ఉండగా మాట్లాడకూడదని సూచించారు.ఇంటి వైరింగ్‌కు నాణ్యమైన ఎర్తింగ్ చేయించుకోవాలని, ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన వైర్లు, ప్లగ్గులు,ఛార్జర్లు మాత్రమే ఉపయోగించాలని తెలిపారు.బట్టలు ఆరబెట్టేటప్పుడు ఇనుప దండెలకు బదులుగా ప్లాస్టిక్‌దండెలు ఉపయోగించాలని,విద్యుత్ లైన్లు, మీటర్ బోర్డుల సమీపంలో తడి బట్టలు ఆరబెట్టవద్దని చెప్పారు.రైతులకు ప్రత్యేకంగా పలు సూచనలు చేశారు. వ్యవసాయ మోటార్‌ను ఆన్ చేసే ముందు స్టార్టర్,వైర్లు,స్విచ్‌లు సురక్షితంగా ఉన్నాయో లేదో పరిశీలించాలని,మోటార్లు, స్టార్టర్లు, GI పైపులు, పంపుసెట్లకు సరైన ఎర్తింగ్ చేయించాలని సూచించారు. ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ఫ్యూజులు మార్చడం, ఏబీ స్విచ్‌లు ఆపరేట్ చేయడం, కాలిన తీగలు సరిచేయడం వంటి పనులు స్వయంగా చేయరాదన్నారు. విద్యుత్ లైన్ల క్రింద ఇనుప పైపులు ఎత్తేటప్పుడు అత్యంత జాగ్రత్త పాటించాలని హెచ్చరించారు.వ్యవసాయ భూముల్లో ఎలక్ట్రిక్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడం చట్టవిరుద్ధమని, చేపల వేట లేదా వన్యప్రాణుల వేటకు విద్యుత్ ప్రవాహాన్ని ఉపయోగించడం తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు.పిల్లలను విద్యుత్ స్తంభాలు,ట్రాన్స్‌ఫార్మర్లు,మీటర్ బోర్డుల వద్ద ఆడనివ్వకూడదని, పశువులను విద్యుత్ స్తంభాలు లేదా ట్రాన్స్‌ఫార్మర్లకు కట్టరాదని తెలిపారు.విద్యుత్ షాక్ సంభవించినప్పుడు బాధితుడిని నేరుగా చేతులతో తాకకూడదని, కర్ర లేదా ప్లాస్టిక్ వంటి విద్యుత్ ప్రసారం చేయని వస్తువులతో వేరు చేసి వెంటనే విద్యుత్ సరఫరా నిలిపివేసి వైద్య సహాయం అందించాలని సూచించారు.కొత్త భవనాల నిర్మాణంలో విద్యుత్ లైన్లకు కనీసం 1.2 మీటర్ల భద్రతా దూరం పాటించాలని, అనుమతి లేకుండా విద్యుత్ లైన్లపై కొండీలు వేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడటం చట్టరీత్యా నేరమని తెలిపారు.తెగిపోయిన విద్యుత్ తీగలు లేదా విద్యుత్ పరికరాల్లో లోపాలు గమనించిన వెంటనే టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. నాసిరకం వైరింగ్,నాణ్యతలేని పరికరాలు, ఎర్తింగ్ లేకపోవడం, అనధికారిక మరమ్మతులు, నిర్లక్ష్యమే ఎక్కువ ప్రమాదాలకు కారణమని చెప్పారు."విద్యుత్‌తో అప్రమత్తంగా ఉండండి... సురక్షితంగా జీవించండి... సురక్షితంగా వ్యవసాయం చేయండి" అని పిలుపునిచ్చిన సూపరింటెండింగ్ ఇంజనీర్ టి. వేణుమాధవ్, ఏదైనా విద్యుత్ ప్రమాదం లేదా లోపం గమనించిన వెంటనే టీజీఎన్‌పీడీసీఎల్ టోల్ ఫ్రీ నంబర్ 1912కు సమాచారం ఇవ్వాలని ప్రజలను కోరారు.


# కమాన్‌పూర్ మండలంలో అత్యధికంగా 141.4 మి.మీ వర్షపాతం

**-పెద్దపెల్లి జిల్లాలోని అత్యధికం**
**-గుండారం రిజర్వాయర్‌కు జలకళ**
**-12 అడుగులకు చేరిన రిజర్వాయర్**



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 29 :** కమాన్ పూర్ మండలంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో చెరువులు కుంటలు జలకల తో కలకల్లాడుతున్నాయి. జిల్లాలోనే అత్యధిక వర్షపాతం కమాన్ పూర్ మండలంలో 141.4 నమోదయింది. కమాన్ పూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద పెద్ద వృక్షం షాపింగ్ లతోపాటు విద్యుత్ తీగలపై పడిపోవడంతో రాత్రంతా విద్యుత్ లేక ఇబ్బందులకు గురయ్యారు. భారీ వృక్షాన్ని తొలగించి ప్రజల ఇబ్బందులను విద్యుత్ శాఖ వారు తొలగించారు. అలాగే భారీ వర్షానికి గుండారం రోడ్డుపై గల ఇమామ్ గిరిని వద్ద ఉన్న ట్రాన్సుర్మర్ కాలిపోయింది. కమాన్ పూర్ మండలంలోని పేరపల్లి – రొంపికుంట గ్రామాల మధ్య ప్రధాన రహదారిలో కల్వర్ట్ వద్ద రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇక్కడ కల్వర్ట్ వద్ద బుంగ పడడంతో అక్కడ తాత్కాలీకంగా చర్యలు చేపట్టినప్పటికీ ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో ఈ ప్రధాన రహదారిలో పెద్ద వాహనాల అంతరాయంగా మారింది. బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో గత రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పెద్దపల్లి జిల్లాలోనే కమాన్ పూర్ మండలంలో అత్యధికంగా వర్షపాతం నమోదైంది. అలాగే గుండారం రిజర్వాయర్ నీటిమట్టం 12 అడుగులకు చేరడంతో మత్తడి పైనుండి నీరు జాలువారితోంది. గుండారం రిజర్వాయర్ లోకి గౌరీ గుండం జిల్లా పాతం వరద నీరు భారీగా చేరుతుంది.కమాన్ పూర్ నుండి గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రహదారిలో గల శాలపల్లె, పెంచికల్ పేట్ ల వద్ద గల కలవర్టుల పై నుండి వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో ఇరువైపులా వాహనాల రాకపోకలకు అవరోధంగా మారింది. ఈ రహదారి పై వాహనాల రాకపోకలు సాగకుండా చెట్ల కొమ్మలను రహదారి పై అడ్డుగా వేశారు.సబ్బితం – ఆర్. ఎఫ్. సీ. ఎల్ ప్రధాన రహదారిలో పేరపల్లి – రొంపికుంట గ్రామాల మధ్య కల్వర్ట్ వద్ద బుంగ పడగ తాత్కాలీకంగా మరమ్మత్తులు చేపట్టినప్పటికీ పెద్ద వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది.జూలపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ముల్కలపల్లి నుండి సెంటినరికాలనీకి వెళ్లే ప్రధాన రహదారిలో గల బొక్కల వాగు పై గల కల్వర్ట్ వద్ద వరద నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహించడంతో రాకపోకల కు అంతరాయం కలిగింది.కమాన్ పూర్ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో గల వృక్షం నేలకూలి ఆసుపత్రి భవనం పై పడింది.జూలపల్లి గ్రామంలో పాడాల రాజేశ్వరి శంకరయ్యల ఇల్లు కూలి పోయింది.కమాన్ పూర్ మండల కేంద్రంలోని కిష్టంపల్లెలో వరద నీరు ప్రధాన రహదారితో పాటు లోతట్టు గృహాల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.గుండారం రిజార్వాయర్ నుండి గల బొక్కల వాగు వరద ఉధృతితో ఉప్పొంగుతూ ప్రవహించింది.జూలపల్లి – గోదావరి ఖని ప్రధాన రహదారిలో ఆదర్శనగర్ ఆదర్శనగర్ వద్ద గల కల్వర్ట్ పై నుండి వరద నీరు రహదారి పైకి చేరుకుని ప్రవహించడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. సిద్ధిపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని శాలపల్లె వద్ద గల కల్వర్ట్ వద్ద వరద నీటిలో చెత్త చేదారాన్ని తొలిగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బంగారు కళ్యాణి మహేష్ ఉపసర్పంచ్ కొత్తపల్లి సతీష్, గ్రామపంచాయతీ సెక్రటరీ జంజర్ల అమల, గ్రామ ప్రజలు ఉన్నారు .కమాన్‌పూర్ క్రాస్ రోడ్ నుండి కమాన్ పూర్ వెళ్లే ప్రధాన రహదారిలో కిష్టం పల్లి వద్ద రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది.





## శివపరాశక్తి పీఠాన్ని దర్శించుకున్న డి.ఎస్.పి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట జూలై 29 :** ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని శ్రీశివ పరాశక్తి పీఠాన్ని గురుపూజోత్సవం సందర్భంగా బుధవారం సిరిసిల్ల డిఎస్పి నాగేంద్ర చారి దర్శించుకున్నారు.ఈ సందర్భంగా శివ పరాశక్తి పీఠం స్వామీజీ కాసు మనోహర్ రాజు అర్చకులు బుగ్గ కృష్ణమూర్తి శర్మలు డిఎస్పి నాగేంద్రచారికి సీఐ వెంకటేష్ కు ఆశీర్వచనం అందజేశారు.శివ పరాశక్తి పీఠాన్ని మొట్టమొదటిసారిగా దర్శించుకోవడానికి వచ్చిన సందర్భంగా డిఎస్పి నాగేంద్రచారిని సీఐ ఓ వెంకటేశ్‌ను స్వామీజీ శాలువాలు కప్పి సన్మానించారు.అనంతరం తీర్థప్రసాదాలు వితరణ చేశారు.ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బండారి బాల్రెడ్డి,శ్రీరామోజీ భాస్కర్‌లు శివయ్యను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

## సత్సంగ సదనంలో ఘనంగా గురుపూజోత్సవం



**చురకలు ప్రతినిధి,ఎల్లారెడ్డిపేట జూలై 29 :** ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని సత్సంగ సద్దనంలో గురు పూజోత్సవం సందర్భంగా శ్రీ శ్రీ శ్రీ సరస్వతి గోవిందరాజు చారిట్రబుల్ ట్రస్ట్ అధ్యక్షులు బ్రహ్మచారి లక్ష్మారెడ్డిని బుధవారం శాలువాలతో ఘనంగా సన్మానించారు.శ్రీ శ్రీ శ్రీ సరస్వతి గోవిందరాజుల పాలరాతి విగ్రహానికి పూలమాలలు సమర్పించుకున్నారు, ప్రత్యేక పూజలు చేశారు.భక్తి శ్రద్ధలతో భజనలు చేశారు.గురుపూజోత్సవంలో నగర సంకీర్తన నిర్వాహకులు గోశిక దేవదాసు మేగీ నరసయ్య బండారి బాల్రెడ్డి పద్మక్క విజయక్క శ్యామలక్క మహిళా భక్తులు తదితరులు పాల్గొన్నారు. సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి వేడుకలు బుధవారం కన్నుల పండగగా జరిగాయి.ఆలయ ప్రధాన అర్చకులు గుండయ్య శర్మ ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు పాల్గొన్న భక్తకోటికి తీర్థప్రసాదాలు అన్న ప్రసాద వితరణ చేశారు.ఎల్లారెడ్డిపేట మండలంలోని వివిధ సాయిబాబా ఆలయాలలో గురు పౌర్ణమి వేడుకలు జరిగాయి.

## మంథని మండలంలో నీట మునిగిన పంట పొలాలు



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 29 :** మంథని మండలంలోనీట మునిగిన పొలాలను మంథని తహసిల్దార్ ఆరీఫ్ ఉద్దీన్ గ్రామ సర్పంచ్ గుడిసె గట్టయ్యయాదవ్ పరిశీలించారు.గత రెండు రోజుల నుండి కురుస్తున్న భారీవర్షలకు ఎగువ నుండి భారీ వరద రావడంతో నాటు పెట్టిన పొలాలన్నీ నీట మునిగినాయి.విషయం తెలిసిన వెంటనే మంథని తహశీల్దార్ ఆరిఫ్ ఉద్దీన్ ఆర్ఐ స్థానిక సర్పంచ్ గుడిసె గట్టయ్యయాదవ్‌తో కలిసి పొలాలను పరిశీలించారు.స్థానిక సర్పంచ్ గత నెల రోజుల క్రితమే వేంపాడు కన్నాల గ్రామ రైతులతో కలిసి నేషనల్ హైవే మీద రెండు పైపులు వేయాలని మంథని ఆర్డీవో సురేష్ కి వినతిపత్రం ఇవ్వడం జరిగిందని తహశీల్దార్ తెలియజేయడం జరిగింది. పైపులు వేస్తే ఈ పరిస్థితి ఉండేది కాదని గ్రామ సర్పంచ్ రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పటికైనా నేషనల్ హైవే అధికారుల తో మాట్లాడి పైపులు వేయాలని కోరారు నీట మునిగిన పొలాలకు నష్టపరిహారం చెల్లించాలని గ్రామసర్పంచ్ రైతులు కోరారు.ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మదన్మోహన్ గ్రామ రైతులు చిదురాల సురేందర్ రెడ్డి ఐలి తిరుపతి పాల్గొన్నారు.

## పెండింగ్ ఫిర్యాదుల పరిష్కారానికి ఎస్పీ ఆదేశాలు




**చురకలు ప్రతినిధి,నిర్మల్,జూలై, 29 :** నిర్మల్ జిల్లా ఎస్పీ.జానకి షర్మిల, ఈరోజు భైంసా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భైంసా సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన ఆర్జిదారుల ఫిర్యాదులను స్వీకరించి, ప్రతి ఫిర్యాదుపై తక్షణమే స్పందించారు. ఫిర్యాదు దారుల ఎదుటే సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో వచ్చిన కొన్ని కుటుంబ సమస్యలపై షీ టీం సిబ్బంది ఇరు వర్గాలకు కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ ద్వారా కుటుంబాలు తిరిగి కలుసుకోవడం జరిగింది. ప్రజలు నిర్మల్ వరకు రావడం కష్టంగా ఉండగా, భైంసాలోనే కౌన్సిలింగ్ కల్పించడం పై ఎస్పీ గారు చూపిన ఆలోచనను బాధితులు సంతృప్తిని వ్యక్తం చేశారు. గతంలో గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కార స్థితి, ఇంకా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని పెండింగ్ లో ఉన్న వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు.

## అమిత్ ఇండియా ఈవీ బైక్స్ షోరూమ్ ప్రారంభం



**చురకలు విలేఖరి వీణవంక జూలై 29 :** వీణవంక మండల కేంద్రంలో అమిత్ ఇండియా ఈవీ బైక్స్ షోరూం ను బుధవారం వీణవంక గ్రామ సర్పంచ్ దాసారపు సరోజన - రాజేంద్ర ప్రసాద్,ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేష్ గౌడ్, అమిత్ ఇండియా ఫౌండర్ మెంబర్ ఎడ్ల ఉప్పల్ రెడ్డి,రామిడి శ్రీనివాస్‌లు కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పర్యావరణ పరిరక్షణకు తోడ్పడే విద్యుత్ వాహనాల వినియోగం రోజురోజుకు పెరుగుతోందని, వినియోగదారులకు నాణ్యమైన సేవలు,అత్యుత్తమ ఈవీ బైక్స్ అందుబాటులోకి తీసుకురావడమే ఈ షోరూమ్ లక్ష్యమని తెలిపారు.ఈ షోరూమ్ యజమానులు వీణవంక ఉప సర్పంచ్ తాళ్లపల్లి మహేష్ గౌడ్,కట్‌కోయిల సంపత్ అతిథులను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు,తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ జూలై 29 :** కమాన్‌పూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బాపూజీ నగర్ లో గల సాయిబాబా ఆలయంలో ఆలయకర్త ఓదెలు గౌడ్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండే భక్తులు హాజరై పూజలు నిర్వహించారు. సాయిబాబా వద్ద మహిళలు కుంకుమపూజలు నిర్వహించారు.అలాగే విద్యార్థులు తమ గురువులకు పాదాభివందనాలు చేశారు. ఆపిల్ కిడ్స్ పాఠశాలలో గురు పౌర్ణమి వేడుకలు స్థానిక మండల కేంద్రంలో గల ఆపిల్ కిడ్స్ పాఠశాలలో గురు పౌర్ణమి సందర్భంగా సముద్రాల వేణుగోపాల చార్యులు గణముగా సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల కరస్పాండెంట్ చదువు వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎవరైతే మంచి మార్గాన్ని చూపిస్తారో వారిని గురువులుగా భావించాలని తెలిపారు అజ్ఞానం నుండి జ్ఞానం వరకు నడిపించే వారే గురువులని తెలియపరిచారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజమణి భూలక్ష్మి చామంతి ప్రియాంక సుప్రజ అర్చన పాల్గొన్నారు.

### భగత్‌నగర్ సంచలన ఇంటి డెకాయిటీ

# కేసును ఛేదించిన కరీంనగర్ పోలీసులు

**-బాధితుడి సొంత అల్లుడు, మనుమడే ప్రధాన సూత్రధారులు**
**-మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితుల అరెస్ట్**
**రూ.2.09 లక్షల నగదు, 43.67 గ్రాముల బంగారం, 64.98 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం**

**చురకలు ప్రతినిధి కరీంనగర్,జూలై 29 :** కరీంనగర్ నగరంలోని భగత్‌నగర్‌లో ఇటీవల జరిగిన సంచలన ఇంటి డెకాయిటీ కేసును కరీంనగర్ పోలీసులు అత్యంత చాకచక్యంగా ఛేదించారు. ఈ కేసులో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని మీరట్‌కు చెందిన ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.2,09,000 నగదు, 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు, 64.98 గ్రాముల వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

**కేసు వివరాలు**

భగత్‌నగర్‌కు చెందిన ఎం.డి. అజ్మత్ అలీ నివాసంలో అర్ధరాత్రి సమయంలో దుండగులు డమ్మీ పిస్టళ్లు, కత్తులతో చొరబడి కుటుంబ సభ్యులను బెదిరించి,వారి చేతులు,కాళ్లు కట్టేసి ఇంట్లోని నగదు,బంగారం,వెండి ఆభరణాలను దోచుకెళ్లారు.బాధితుడి ఫిర్యాదు మేరకు కరీంనగర్ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ఘటనా స్థలం, నిందితులు పారిపోయిన మార్గాల్లోని సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు.నిందితులు దోపిడీ అనంతరం దొంగిలించిన ద్విచక్ర వాహనాలపై హుజురాబాద్ వైపు వెళ్లి, పెద్ద పాపయ్యపల్లి సమీపంలో వాటిని వదిలివెళ్లినట్లు గుర్తించారు. సాంకేతిక ఆధారాల ద్వారా నిందితులు ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌కు చెందిన వారని పోలీసులు నిర్ధారించారు.



**యూపీలో ప్రత్యేక బృందాల గాలింపు - ముగ్గురు అరెస్ట్**

దర్యాప్తులో భాగంగా కరీంనగర్ పోలీసుల ప్రత్యేక బృందాలు మీరట్‌కు వెళ్లి స్థానిక పోలీసుల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టాయి.ఈ క్రమంలో పోలీసుల నుంచి తప్పించు కునేందుకు రైల్వే స్టేషన్‌కు వెళ్తున్న ముగ్గురు నిందితులను జూలై 29న అదుపులోకి తీసుకున్నారు.

**అరెస్టయిన నిందితులు**

1. సల్మాన్ ఏ భూరే ఏ యాదవ్ (22), ఫల వ్యాపారి, మీరట్
   - స్వాధీనం: రూ.84,000 నగదు, 11.95 గ్రాముల బంగారం.
2. సల్మాన్ విమాన్ (22), కూలీ, మీరట్
   - స్వాధీనం: రూ.67,000 నగదు, 11.71 గ్రాముల బంగారం.
3. మొహమ్మద్ హసీన్ (19), మీరట్
   - స్వాధీనం: రూ.58,000 నగదు, 14.01 గ్రాముల బంగారం.

**మొత్తం స్వాధీనం**

- రూ.2,09,000 నగదు
- 43.67 గ్రాముల బంగారు ఆభరణాలు
- 64.98 గ్రాముల వెండి ఆభరణాలు

**సొంత అల్లుడు, మనుమడే కుట్రకు సూత్రధారులు**

దర్యాప్తులో బాధితుడు ఎం.డి. అజ్మత్ అలీ సొంత అల్లుడు రజావుద్దీన్ (ఏ1), మనుమడు అజీమ్ రజా (ఏ2) ఈ డెకాయిటీకి ప్రధాన సూత్రధారులుగా గుర్తించారు.రజావుద్దీన్‌పై గతంలో హత్య కేసు, ఆయుధాల కేసులతో పాటు ఇతర నేర కేసులు నమోదై ఉన్నాయి.కుటుంబ కలహాల కారణంగా అతని భార్య గత ఏడాది కరీంనగర్‌లోని పుట్టింటికి వచ్చింది. భార్యను తీసుకెళ్లేందుకు వచ్చిన రజావుద్దీన్ విఫలమవడంతో తిరిగి వెళ్లాడు. అనంతరం మళ్లీ వచ్చి ఆత్మహత్యా యత్నం చేయగా బాధిత కుటుంబ సభ్యులు అతనికి చికిత్స చేయించి తమ ఇంట్లోనే ఉంచుకున్నారు.అనంతరం అతనికి బట్టల వ్యాపారం ప్రారంభించేందుకు ఆర్థిక సహాయం కూడా అందించారు.అయితే వ్యాపారంలో నష్టపోయిన రజావుద్దీన్ తరచూ భార్య, మామ వద్ద డబ్బులు డిమాండ్ చేస్తూ వేధించేవాడు. ఇటీవల రూ.5 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి చేయగా నిరాకరించడంతో గొడవపడి, మంచిర్యాలలో కొత్త దుకాణం పెడుతున్నట్లు చెప్పి బాధితుడి కారుతో మీరట్ వెళ్లిపోయాడు.కరీంనగర్‌లో బాధితుడి ఇంట్లో నివసించిన సమయంలో ఇంట్లో ఉన్న నగదు, బంగారు ఆభరణాలపై పూర్తి అవగాహన ఏర్పరుచుకున్న రజావుద్దీన్, తన కుమారుడు అజీమ్ రజా మరియు మీరట్‌కు చెందిన మరో ముగ్గురితో కలిసి పథకం రచించాడు.ఈ నెల 20న మీరట్ నుంచి రైలులో రామగుండం చేరుకుని,21వ తేదీ అర్ధరాత్రి సమయంలో డమ్మీ పిస్టళ్లు, కత్తులతో బాధితుడి ఇంట్లోకి చొరబడి కుటుంబ సభ్యులపై దాడి చేసి దోపిడీకి పాల్పడ్డారు.

**పరారీలో ప్రధాన నిందితులు**

అరెస్టయిన ముగ్గురు నిందితులను మీరట్ గౌరవ న్యాయస్థానంలో హాజరుపరిచి ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలిస్తున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు రజావుద్దీన్ (ఏ1), అజీమ్ రజా (ఏ2)లితో పాటు ఇతర నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు ముమ్మరంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి.

# యూట్యూబ్ ఛానల్‌పై విద్వేష ప్రచారం ఆరోపణలు

**-కరీంనగర్ సీపీకి ఫిర్యాదు**
**ముస్లిం సమాజాన్ని లక్ష్యంగా చేసుకుని దుష్ప్రచారం చేశారంటూ ఫిర్యాదు**
**వీడియోపై విచారణ జరిపి ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను కోరిన ఫిర్యాదుదారు**

**చురకలు ప్రతినిధి,కరీంనగర్,జూలై 29 :** సామాజిక మాధ్యమాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వీడియో ప్రసారం చేశారంటూ ఓ డిజిటల్ మీడియా ఛానల్‌పై కరీంనగర్ పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు అందింది. సప్తగిరి కాలనీకి చెందిన మహమ్మద్ అజీమ్ ఈ మేరకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు సమర్పించారు.ఫిర్యాదు ప్రకారం, WISE TV (@thewisedigitalmedia)పేరుతో నిర్వహించబడుతున్న యూట్యూబ్/డిజిటల్ మీడియా ఛానల్ లో ప్రసారమైన ఓ వీడియోలో ముస్లిం సమాజం,వారి మత విశ్వాసాలను లక్ష్యంగా చేసుకుని అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని ఆరోపించారు. ముఖ్యంగా "భారతదేశాన్ని ముస్లిం దేశంగా మార్చడం"వంటి వ్యాఖ్యల ద్వారా ముస్లిం సమాజంపై అనుమానాలు,అసహనం, విద్వేషం పెంచే ప్రయత్నం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు.ఇలాంటి వ్యాఖ్యలు మత సామరస్యానికి భంగం కలిగించే అవకాశం ఉందని, సమాజంలో శాంతిభద్రతలపై ప్రతికూల ప్రభావం చూపే ప్రమాదం ఉందని ఫిర్యాదుదారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ వీడియోపై సమగ్ర విచారణ నిర్వహించి,చట్టపరంగా బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదులో భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్ 196, 299, 353తో పాటు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టంలోని సంబంధిత నిబంధనల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. వీడియో క్లిప్, స్క్రీన్‌షాట్లు తదితర డిజిటల్ ఆధారాలను కూడా పోలీసులకు సమర్పించినట్లు తెలిపారు.ఈ ఫిర్యాదుపై పోలీసులు విచారణ చేపట్టి, అందుబాటులో ఉన్న డిజిటల్ ఆధారాలను పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై సంబంధిత ఛానల్ నిర్వాహకుల స్పందన వెలువడాల్సి ఉంది.

### మాజీ ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను

## పరామర్శించిన మాజీ ఎంపీ కెప్టెన్, మాజీ ఎమ్మెల్యే సతీష్

**చురకలు ప్రతినిధి కరీంనగర్ జూలై 29 :**

సికింద్రాబాద్ యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ని పరామర్శించిన మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మికాంతారావు



హుస్నాబాద్ మాజీ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ పరామర్శించారు.ఆయనకు అందిస్తున్న వైద్యం గురించి, తెలుసుకొని ప్రస్తుత ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్లను అడిగి తెలుసుకున్న అనంతరం పెద్ది సుదర్శన్ రెడ్డి భార్య, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పిన మాజీ రాజ్యసభ సభ్యులు కెప్టెన్ లక్ష్మి కాంతారావు మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ పరామర్శించారు.

# అభివృద్ధి సమీక్ష సమావేశాలు నిర్వహించాలి

**- ఇబ్రహీంపట్నం మండలంలో ప్రత్యేక అధికారి జయరాజ్**

**చురకలు విలేకరి ఇబ్రహీంపట్నం జూలై (29 ) :** అభివృద్ధి సమీక్ష సమావేశాలు నిర్వహించాలని జగిత్యాల ఇబ్రహింపట్నం మండల ప్రత్యేక అధికారి జయరాజ్ అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి 45 రోజులకు ఒకసారి ఇలాంటి సమీక్ష సమావేశాలు నిర్వహించి, వివిధ శాఖల పనితీరును క్రమం తప్పకుండా సమీక్షించడం జరుగుతుందన్నారు.




సమావేశంలో బిల్డింగ్ కెపాసిటీ, ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాల అమలు, గ్రామాల అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న సేవలు తదితర అంశాలపై సర్పంచులు, మండల స్థాయి అధికారులతో విస్తృతంగా చర్చించారు. ఆయా శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన కార్యక్రమాల అమలు, సాధించిన పురోగతి, ఎదురవుతున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలను సమావేశం లో వివరించారు.ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు సకాలంలో చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ప్రత్యేక అధికారి జయరాజ్ సూచించారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన చర్యలను వేగవంతం చేయాలని, ప్రభుత్వ లక్ష్యాలను విజయవంతంగా అమలు చేయడంలో ప్రతి శాఖ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన పేర్కొన్నారు.విధ్యుత్ స్థబలకు వైర్లు అమర్చ లేదని,పశు వైధ్య అదికారులు గ్రామలకు రావటం లేదని,ఆరోగ్య సిబ్బంది సమయ పాలన పాటిచటం లేదని సర్పంచ్ లు కాశీరెడ్డి బస్కర్ రెడ్డి, బండీ రాజేష్, పోనుకంటీ వెంకట్ లు అదికారుల దృష్టి కీ తిబుకోచ్చారు.ఈ సమావేశంలో ఎంపీడీవో సీహెచ్ గణేష్, తహసీల్దార్ వర ప్రసాద్, ఎంపీఓ ఏ.వి. రామకృష్ణరాజు, మండల విద్యాధికారి బండారి మధు వివిధ శాఖల అదికారులు,మండల సర్పంచ్ లు తదితరులు పాల్గొన్నారు.

# టీ-హబ్,టీ-వర్క్స్‌ను సందర్శించిన డిగ్రీ కళాశాల విద్యార్థులు

**చురకలు ప్రతినిధి కోరుట్ల, ,జూలై 29 :** కోరుట్లఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు బుధవారం హైదరాబాద్ లోని ప్రతిష్టాత్మక టీ-హబ్,టీ-వర్క్స్ సంస్థలను సందర్శించారు.ఈ సందర్భంగా విద్యార్థులు ఆధునిక సాంకేతిక రంగంలో చోటుచేసుకుంటున్న మార్పులు,స్టార్టప్‌ల అభివృద్ధి,నూతన ఆవిష్కరణలు,యువతకు అందుబాటులో ఉన్న నైపుణ్యాభివృద్ధి అవకాశాలపై ప్రత్యక్ష అవగాహన పొందారు.టీ-హబ్‌లో స్టార్టప్‌లకు అందిస్తున్న మార్గదర్శకత్వం,మెంటరింగ్, సాంకేతిక సహకారం,పెట్టుబడుల అవకాశాల గురించి విద్యార్థులు తెలుసుకోగా టీ-వర్క్స్‌లో ఆధునిక యంత్రాలు, ప్రోటోటైపింగ్ సదుపాయాలు ఉత్పత్తుల రూప కల్పన ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ మాట్లాడుతూ విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే యువత భవిష్యత్తులో మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకోగలరని అన్నారు. డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగాల కోసం మాత్రమే ఎదురుచూడకుండా తమ ఆలోచనలు, ప్రతిభ నైపుణ్యాలతో కొత్త అవకాశాలను సృష్టించే స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. టీ-హబ్,టీ-వర్క్స్ వంటి సంస్థలు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం



చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ సందర్శన ద్వారా తమలో కొత్త ఆలోచనలు, ఆత్మవిశ్వాసం పెరిగాయని సాంకేతిక రంగంలో ఉన్న అవకాశాలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం వల్ల తమ భవిష్యత్ లక్ష్యాలపై మరింత స్పష్టత వచ్చిందని విద్యార్థులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచ స్థాయి సాంకేతిక పరిజ్ఞానం నైపుణ్యాభివృద్ధి, స్టార్టప్ అవకాశాలను పరిచయం చేయాలనే లక్ష్యంతో ఇలాంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌కు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# డిప్యూటీ కమిషనర్ పదవి విరమణ ముందస్తు సన్మానం

**చురకలు విలేఖరి,కరీంనగర్, జూలై, 29 :** ఈనెల 31న పదవి విరమణ చేస్తున్న హైదరాబాద్ వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయం లో ఇన్ఫోర్స్మెంట్ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి పదవి విరమణ చేస్తున్న సందర్భంగా కరీంనగర్ పట్టణంలో గతంలో 10సంవత్సరాలుగా కరీంనగర్ జిల్లా కేంద్రంలో పనిచేసిన సందర్భంగా ఆమెకు ఈరోజు కరీంనగర్ ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నులశాఖ అధికారులు ఉద్యోగులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ గోపాల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గోల్కొండ జెసి రవి మహబూబ్ నగర్ వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ శ్రీలీల కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ సుబ్రహ్మణ్యం అసిస్టెంట్ కమిషనర్లు కవిత జగిత్యాల్ చరణ్ పెద్దపల్లి దేవేందర్ కామారెడ్డి డి సి టి ఓ గౌతమ్ సిద్ధార్థ శైలజ వెంకటేశ్వర్లు రమేష్ తెలంగాణ




కమర్షియల్ టాక్సెస్ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ ఉపాధ్యక్షులు జి బిక్షపతి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో శ్రీ లీల మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన సందర్భంగా మేము కరీంనగర్ జిల్లాలో ఎన్నో కార్యక్రమములు మా హయాము లో చేపట్టడం జరిగిందని కరీంనగర్ గడ్డను ఎవరు కూడా మర్చిపోరని ఆమె అన్నారు రవి మాట్లాడుతూ వాణిజ్య పన్నుల శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఖజానాకు రెవిన్యూ తేవటములో ప్రతి ఒక్కరూ ముందుండాలని గతంలో మా తోటి అక్క సంధ్యారాణి ఈనెల 31న పదవి విరమణ చేస్తున్న కార్యక్రమానికి కరీంనగర్లో ఏర్పాటు చేయటం చాలా సంతోషమని ఆయన అన్నారు కరీంనగర్ పట్టణంలో ఇంత మంచి కార్యక్రమం ఏర్పాటు చేయటం నాకెంతో సంతోషంగా ఉందని కరీంనగర్ వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ గోపాల్ అన్నారు ఈ సందర్భంగా తెలంగాణ కమర్షియల్ టాక్సెస్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ ముజాహిద్ హుస్సేన్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లా కేంద్రంలో గతంలో 10 సంవత్సరాలుగా ఇక్కడ ఏ సి టి ఓ మరియు డి సి టి ఓ పెద్ద పల్లి వాణిజ్య పన్నుల అధికారిగా పనిచేసిన సంధ్యారాణిని గుర్తించుకొని కరీంనగర్ పట్టణానికి పిలిపించుకొని ఈనెల 31న పదవి విరమణ చేస్తున్న సందర్భం కంటే ముందు కరీంనగర్ పట్టణంలో పిలిపించుకుని కరీంనగర్ ఉమ్మడి జిల్లాల వాణిజ్య పన్నుల అధికారులు ఉద్యోగులు అందరూ కలిసి ఆమెకు భారీ ఎత్తున సన్మానం చేస్తూ వీడుకోలు చెప్పినారు ఆమె సంధ్యారాణి మాట్లాడుతూ నేను నా జీవితకాలంలో కూడా కరీంనగర్ జిల్లా కేంద్రాన్ని ఎప్పుడు కూడా మరువను మరియు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు ఉద్యోగులు ప్రతి ఒక్కరు నాకు ఎంతో గౌరవం ఇచ్చినరు ఇలాంటి వారిని నేను ఎప్పుడూ కూడా మర్చిపోనని ఆమె చెప్పినారు ఈ కార్యక్రమంలో మహమ్మద్ సలావుద్దీన్ విష్ణు ఎన్వి రమేష్ శంకర్ మహమ్మద్ అబ్దుల్ బారి కృష్ణవేణి సునీత అనిత ఇలియాస్ ముప్పిడి శ్రీనివాస్ ప్రవీణ్ రెడ్డి రాజేశ్వరరావు నరేష్ శ్రీకాంత్ గోపాల్ రావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం



**చురకలు ప్రతినిధి కోరుట్ల, జూలై 29 :** బుధవారం ఉదయం 10:30 గంటలకు కోరుట్ల నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమగ్ర సవరణ ( స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా బీఎల్‌వోలు ( బి ఎల్ ఓ లు),బీఎల్ఏలు (బిఎల్ఎలు) తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో మరణించిన ఓటర్లు,డబుల్ ఓటర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్లను గుర్తించి మార్క్ అన్ కలెక్టబుల్ రీజన్స్ ద్వారా వారి పేర్ల తొలగింపు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు.అలాగే ఇంకా డిజిటలైజేషన్ చేయాల్సి ఉన్న ఓటర్ల ఎనిమిరేషన్ ఫామ్స్‌ను పూర్తి చేసి, 100 శాతం డిజిటలైజేషన్ లక్ష్యాన్ని సాధించాలని అధికారులకు, సంబంధిత సిబ్బందికి దిశానిర్దేశం చేశారు.ఈ సమావేశంలో కోరుట్ల రెవెన్యూ డివిజనల్ అధికారి ఓటర్ నమోదు అధికారి ఎల్. జీవాకర్ రెడ్డి, కోరుట్ల తహసీల్దార్ చి. కృష్ణ చైతన్య, మెట్‌పల్లి తహసీల్దార్ ఎన్. నీతా, మల్లాపూర్ తహసీల్దార్ రాంచందర్, ఇబ్రహీంపట్నం నాయబ్ తహసీల్దార్ ప్రసాద్,కోరుట్ల నాయబ్ తహసీల్దార్ ఎం.డి.ఫారూఖ్‌తో పాటు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి శ్రీధర్ బాబు

**- మంత్రిని వేదమంత్రాలు తో ఆశీర్వదించిన ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ**



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 29 :** మంథని పట్టణంలోని రావిచెరుకట్ట వీధిలో గల శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు దర్శించుకున్నారు. గురు పౌర్ణమి పర్వదినమును పురస్కరించుకొని శ్రీ మహాలక్ష్మి అమ్మవారిని శాఖాంబరి దేవిగా అలంకరించారు. ఆలయ అర్చకులు మారుపాక ప్రశాంత్ శర్మ మంత్రికి స్వాగతం పలికి వేద మంత్రాలతో ఆశీర్వదించారు. ఎన్ని కార్యక్రమాలు ఉన్నా మంత్రి శ్రీధర్ బాబు మంథని పట్టణంలోని ఆలయాల్లో జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో పాల్గొనడం ఆల భక్తి భావాన్ని చాటుతుంది. తండ్రి దివంగత శాసనసభ మాజీ స్పీకర్ శ్రీపాదరావు సైతం దైవ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. ఆయన బాటలోనే ఆయన తనయులు శ్రీధర్ బాబు, శీను బాబులు ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొంటూ ఆలయాల పునరుద్ధరణకు పాటుపడుతుండడం పట్ల భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## నంది పంప్ హౌజ్ నుండి మిడ్ మానేరుకు గోదావరి జలాల తరలింపు



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, జులై 29 :** మంగళవారం రాత్రినుండి ఎడతెరిపి లేకుండాకురుస్తున్న వర్షం కారణంగా ఎల్లంపల్లికి వరదనీరు భారీగా చేరడంతో ధర్మారం మండలం నందిమేడారం పంప్ హౌజ్‌కు ఎల్లంపల్లి నీటిని తరలిస్తూ ఇక్కడి పంప్ హౌజ్ ద్వారా మిడ్ మానేరు కు గోదావరి జలాలను తర లించే ప్రక్రియ ప్రారంభించారు. మేడారం నంది పంప్ హౌజ్ లోకి12,600 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తూ ఇక్కడి నుండి రామడుగు మండలం లక్ష్మీపూర్ గాయిత్రి పంప్ హౌజ్ కు నీటిని పంపించి అక్కడినుండి మిడ్ మానేరు కు 9,450 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నట్లు సంబంధిత ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా మంచినీటి కొరత తీర్చేందుకు ఈ నీటిని తరలిస్తున్నట్లు, వర్షాలు మరో మూడురోజుల పాటు కురిసే వీలుండడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టులో భారీగా చేరే నీటిని దృష్టిలో పెట్టుకొని దశల వారీగా గోదావరి జలాలను తరలించే వీలుందని అధికారులు తెలిపారు.

### రామడుగు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన

# కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

**చురకలు క్రైమ్ ప్రతినిధి, కరీంనగర్, జూలై 29 :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని రామడుగు పోలీసు స్టేషన్‌ను బుధవారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు.అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లో ఉన్న సిబ్బందితో మాట్లాడి,వారికి కేటాయించిన విధుల గురించి అడిగారు.సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సిసిటిఎన్ఎస్‌లో పొందుపరచాలని ఆదేశించారు.తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా



అందుబాటులోకి తెచ్చిన:సీసీటీఎన్ఎస్ – 2.0,పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ మరియు అమలు, టీఎస్-కాప్,హెచ్ఆర్ఎంఎస్,ఈ-సాక్ష్య ,టెక్ డాటం, ఐరాడ్ దర్పణ్, సీఈఐఆర్ , సైబర్ క్రైమ్ ఆర్థిక/ఆర్థికేతర నేరాల సాఫ్ట్‌వేర్, సీడీఆర్ వంటి అన్ని రకాల అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి,వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలని సూచించారు. స్టేషన్‌కు కేటాయించిన వస్తువులను పరిశీలించడంతో పాటు, బ్లూ కోల్ట్స్ సిబ్బంది పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్‌ను ఉపయోగిస్తున్న తీరును తనిఖీ చేశారు.ఎఫ్ ఐ ఆర్ ఇండెక్స్‌ను పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు.కేసుల పెండింగ్‌కు గల కారణాలను అడిగి తెలుసుకుని,వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు.నమోదైన సైబర్ నేరాల గురించి వివరాలు తెలుసుకుంటూ, విసిబుల్ పోలిసింగ్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రామడుగు పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి, వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు.రౌడీ షీటర్లు,హిస్టరీ షీటర్లపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటి కప్పుడు గమనించాలని,ప్రతినెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని నమోదు చేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయ కుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, రామడుగు ఎస్సై రాజులతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు సుభిక్షంగా ఉండాలి

**-కాంగ్రెస్ నేత వొడితల వొడితల ప్రణవ్**

**-కొండగట్టులో మంత్రులతో కలిసి గిరిప్రదక్షిణ చేసిన ప్రణవ్**



**చురకలు ప్రతినిధి హుజురాబాద్ జూలై 29 :** రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురవాలని, రైతులకు ఎల్నీనో నుండి ఇబ్బందులు రావద్దని ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ బుధవారం మంత్రులు పొన్నం ప్రభాకర్ ,అడ్లూరి లక్ష్మణ్‌కుమార్,విప్ ఆది శ్రీనివాస్‌తో కలిసి కొండగట్టు దేవాలయ గిరిప్రదక్షిణ చేశారు.జిల్లా పార్టీ అధ్యక్షుడు,చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఆధ్వర్యంలో నిర్వహించిన కొండగట్టు గిరిప్రదక్షణలో ఆయన మంత్రులతో కలిసి పాల్గొన్నారు.భారీ వర్షంలోను గిరి ప్రదక్షణ చేస్తూ భక్తులను ఉత్సాహపరిచారు.ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ కొండగట్టు అంజన్నకు ఎంతో మహత్తు ప్రాశస్త్యం ఉన్నాయని,స్వామివారి అనుగ్రహం ప్రజలందరిప ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురవాలని, పాడి పంటలతో రైతన్నలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. సహజంగా ప్రకృతి సృష్టించిన ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి కాంగ్రెస్‌పార్టీపై నెట్టడం హాస్యాస్పదమని అన్నారు.ఎమ్మెల్యే ప్రజలను రైతులను రెచ్చగొట్టే మాటలు మానుకో వాలని హితవు పలికారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కాంగ్రెస్‌పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# కళ్లు లేని కబోధిలా వ్యవహరిస్తున్న ప్రతిపక్షాలు

**-ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి**



**చురకలు విలేఖరి,తిమ్మాపూర్ జులై 29 :** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కళ్ల ముందు కదలాడుతున్నా ప్రతిపక్షాలకు కానరాక కళ్లు లేని కబోదిలా వ్యవహరిస్తున్నాయని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ విమర్శించారు. బుధవారం తిమ్మాపూర్ మండల పరిషత్ సమావేశమందిరంలో వివిధ గ్రామాల 99 మంది లబ్ధిదారులకు 31.92 లక్షల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆయన పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలను అమలు చేయని బీఆర్ఎస్, దానికి వంతపాడుతూ అంటకాగిన బీజేపీ పార్టీలు కాంగ్రెస్ పథకాలపై తప్పుడు ప్రచారాలకు పూనుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూర్చే విధంగా వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్షాలు విమర్శలు చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. గత పాలనలో లక్ష రూపాయల వరకు రుణ మాఫీ చేసి చేతులు దులుపుకున్న విషయాన్ని విస్మరించిన గులాబీ నేతలు 2 లక్షల వరకు రుణ మాఫీ అమలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం ఆక్షేపణీయమని ఆయన పేర్కొన్నారు. సాంకేతిక కారణాల వల్ల 2 లక్షల రుణమాఫీ పొందడంలో కొద్ది మంది రైతులకు ఆలస్యం జరిగిందే తప్ప మరో ఉద్దేశం కాదని, అర్హులైన వారందరికీ ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వడం చేతకాని గత పాలకులు ఇందిరమ్మ ఇళ్ల ద్వారా సొంతింటి కలను సాకారం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం తగునా అని ఆయన సూటిగా ప్రశ్నించారు. డబుల్ బెడ్ రూమ్ పథకం అమలు కోసం మోదీ ప్రభుత్వ సాయాన్ని కోరాలన్న సోయి అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ బేషజాలను పక్కనబెట్టి జనహితం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పలు మార్లు మోడీని కలిసి లక్ష ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరారని ఆయన గుర్తు చేశారు. ఇళ్లు లేని నిరుపేదలకు, ముఖ్యంగా గుడిసెల్లో నివాసం ఉంటున్న వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలకు కట్టుబడి వాటిని అమలు చేస్తున్నదని ఆయన చెప్పారు. దొడ్డు బియ్యానికి బదులు సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, కిలో సన్న బియ్యాన్ని 60 రూపాయలకు ప్రభుత్వం కొనుగోలు చేసిన రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పవన్ కుమార్, తిమ్మాపూర్ తహసీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో మల్హోత్రా, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, నుస్తులాపూర్, పోరండ్ల సింగిల్ విండో చైర్మన్లు మోరపల్లి రమణారెడ్డి, గోపు మల్లారెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ చెన్నబోయిన రవి, పార్టీ నాయకులు దావు సంపత్ రెడ్డి, శ్రీగిరి రంగారావు, తుమ్మనపల్లి శ్రీనివాసరావు,కొత్త తిరుపతిరెడ్డి, గొట్టెముక్కుల సంపత్ రెడ్డి, పోలు రాము, రమేశ్, నోముల అనిల్, కేతిరెడ్డి ఎల్లారెడ్డి, లక్ష్మణ్, తుర్తి అరవింద్ తోపాటు వివిధ గ్రామాల సర్పంచులు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

### భారీ వర్షాల నేపథ్యంలో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్**



**చురకలు ప్రతినిధి, జగిత్యాల, జూలై 29 :** జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జగిత్యాల నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ వాగులు,వంకలు,చెరువులు, కాలువలు ఉప్పొంగి ప్రవహిస్తున్న ప్రాంతాల్లోకి వెళ్లే ప్రయత్నం చేయవద్దని, విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగల దగ్గరకు వెళ్లవద్దు.వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు.వర్షం కారణంగా శిథిలావస్థలో ఉన్న గోడలు, పాత భవనాలకు దూరంగా ఉండాలని, పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని, తల్లిదండ్రులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రైతులు ఉరుములు, మెరుపులు ఉన్న సమయంలో పొలాల్లో పని చేయకుండా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని, వాహనదారులు నీటితో నిండిన రహదారులపై వేగంగా ప్రయాణించ వద్దన్నారు. ప్రభుత్వం, వాతావరణ శాఖ, జిల్లా అధికార యంత్రాంగం జారీ చేసే అధికారిక హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అత్యవసర సమయంలో ఏదైనా ప్రమాదం జరిగినా, సహాయం అవసరమైతే స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామ పంచాయతీ, మున్సిపల్ అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసు, అగ్నిమాపక శాఖ, విద్యుత్ అధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఎమ్మెల్యే కోరారు.

### వర్షాల నేపథ్యంలో

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



**-పెద్దపల్లి డీసీపీ బి.రామ్ రెడ్డి**

**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ జూలై 29 :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి జోన్ గోదావరిఖని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ వర్షాలతో నాలాల ప్రవహించే నీరు రోడ్డుపై రావడంతో ఆ ప్రాంతాలను పెద్దపల్లి డిసిపి బి రామ్ రెడ్డి, మున్సిపల్ కమీషనర్, మేయర్ మహంకాళి స్వామి, గోదావరిఖని ఏసిపి ఎం రమేష్ గోదావరిఖని వన్ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డితో మల్కాపూర్, మెడికల్ కళాశాల, 5 ఇంక్లైన్, తదితర ప్రాంతలలో కలిసి వరదను పరిశీలించి జిల్లాలో భారీ వర్షాలతో వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరం అయితే తప్ప బయటకు రావద్దని, అదేవిదంగా అధికారులకు అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, భారీ వర్షాలు కురుస్తుందున వల్ల ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు, చెరువులు నదుల వద్ద వరద ప్రవాహం అధికంగా ఉందని, వాటి వద్దకి ఎవరు వెళ్లవద్దన్నారు. గోదావరి, మానేరు నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, చెరువులు, వాగులు, ప్రాజెక్టుల వద్దకు ప్రజలు, యువత వెళ్లకూడదన్నారు. వర్షం నీటి వల్ల రోడ్డుపై వాహనాలు స్కిడ్ అయ్యే ప్రమాదం ఉన్నందున, పరిమిత వేగంతో వాహనాలు నడపాలని సూచించారు. పిల్లలు, యువకులు చెరువులు నది దగ్గరకు సెల్ఫీలు తీసుకోవడానికి, ఈత కొట్టడానికి వెళ్లకుండా తల్లిదండ్రులు దృష్టి సారించాలన్నారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు సేవలంచడానికి జిల్లా పోలీసు అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉన్నారని, ఎటువంటి సహాయం కావాలన్నా 100 కి డయల్ లేదా స్థానిక పోలీస్ అధికారులకి ఫోన్ చేయాలని డీసీపీ సూచించారు.